




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| సోమవారం 24 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 83 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


# తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి







లండన్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ జాతీయ ప్రతినిధి): ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లండన్‌లోని తెలుగు ప్రవాసులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం లండన్‌లో తెలుగు ప్రవాసులతో ఆత్మీయంగా సమావేశమై తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై వారితో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసులు భాగస్వాములు కావాలని, తెలంగాణ రైజింగ్‌కు బలమైన మద్దతుదారులుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా మారి రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని కోరారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయి పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత, ఉపాధి అవకాశాలను ఆకర్షించడమే తెలంగాణ రైజింగ్ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల సహకారం కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రవాసులు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.




# 6,500కుపైగా రైల్వే స్టేషన్లు, 10,000కుపైగా లెవెల్ క్రాసింగ్‌లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారత రైల్వే వ్యవస్థలో ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 6,500కుపైగా రైల్వే స్టేషన్లు, 10,000కుపైగా లెవెల్ క్రాసింగ్‌లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైళ్ల రాకపోకలను నియంత్రించే కీలక సిగ్నలింగ్ వ్యవస్థల్లో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ ఒక ముఖ్యమైన సాంకేతికతగా పనిచేస్తుందని, రైలు మార్గాలు, సిగ్నళ్లు, పాయింట్ల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ద్వారా తప్పు మార్గంలో రైళ్లు వెళ్లే అవకాశాలను తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు. ముఖ్యంగా రైల్వే కార్యకలాపాల్లో మానవ తప్పిదాలు ప్రమాదాలకు దారితీసే అవకాశాన్ని తగ్గించడం, సిగ్నలింగ్ వ్యవస్థల విశ్వసనీయతను పెంచడం, రైళ్ల సురక్షిత రాకపోకలను నిర్ధారించడం వంటి అంశాల్లో ఆధునిక ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో రైల్వే మౌలిక వసతుల ఆధునీకరణలో భాగంగా సిగ్నలింగ్, కమ్యూనికేషన్, ఆటోమేషన్ వంటి సాంకేతిక వ్యవస్థలను విస్తరించడం ద్వారా భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద కూడా సాంకేతిక ఆధారిత భద్రతా చర్యలు ప్రమాదాల నివారణకు ఉపయోగపడతాయని, రైల్వే భద్రత విషయంలో మానవ పర్యవేక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా అనుసంధానం చేయడం ద్వారా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది భద్రతను మరింత పటిష్టం చేయవచ్చని వెల్లడించారు. రైల్వే వ్యవస్థను సురక్షితమైనదిగా, ఆధునికమైనదిగా, సమర్థవంతమైనదిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో సాంకేతిక ఆధునీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని స్పష్టం చేశారు.




# బ్రిక్స్ దేశాలతో క్రీడా రంగంలో సహకారానికి ఏపీ ప్రతిపాదన

విశాఖపట్నం, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశాలు, గాలా డిన్నర్‌లో పాల్గొన్న సందర్భంగా క్రీడలు జీవితాలను మార్చే శక్తిని కలిగి ఉన్నాయని, ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ కలిగిన వ్యక్తులను తీర్చిదిద్దడంతో పాటు సమాజాలను ఏకం చేసి బలమైన దేశాల నిర్మాణానికి దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 'గ్రాస్‌రూట్స్ నుంచి గోల్డ్ వరకు' అనే లక్ష్యంతో క్రీడా ప్రతిభను గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ వేదిక వరకు తీసుకెళ్లేందుకు 'ఏపెక్స్ 2036' ద్వారా బలమైన వ్యవస్థను నిర్మిస్తున్నట్లు తెలిపింది. 2036 ఒలింపిక్స్ కోసం ఛాంపియన్లను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించింది. విశాఖపట్నాన్ని కీలక కేంద్రంగా చేసుకుని బ్రిక్స్ యువజన, క్రీడా ఆవిష్కరణల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిపింది. ఈ నెట్‌వర్క్ ద్వారా క్రీడాకారులు, కోచ్‌ల పరస్పర మార్పిడి, క్రీడా శాస్త్రం, సాంకేతికత, పారా స్పోర్ట్స్, ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని పెంపొందించవచ్చని పేర్కొంది. నెల్లూరులో క్రీడా పరికరాల తయారీ, ఆవిష్కరణల కేంద్రాన్ని అభివృద్ధి చేయడం, విశాఖపట్నంలో జలక్రీడల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, అరకు లోయలో క్రీడా పర్యాటక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. క్రీడలు, పర్యాటకం, తయారీ తదితర రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, భాగస్వామ్యాలకు బ్రిక్స్ దేశాలను ఆహ్వానిస్తూ యువతకు మరింత బలమైన అవకాశాలు కల్పించి, ప్రతిభను ప్రోత్సహిస్తూ దేశాలకు గర్వకారణంగా నిలిచే విజేతల తరాన్ని తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చింది.

# లఖ్‌పతి దీదీలుగా మహిళల ఆర్థిక సాధికారతే నిజమైన నారీ శక్తి వికాసం: బీజేపీ




న్యూఢిల్లీ, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మహిళల సాధికారతను కేవలం రాజకీయ నినాదాలకు పరిమితం చేయకుండా, వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు నారీ శక్తి వికాసానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం, ముఖ్యంగా మంత్రివర్గ స్థాయిలో తగిన అవకాశాలు దక్కలేదనే విమర్శలను ప్రస్తావిస్తూ, బీజేపీ ప్రభుత్వం మహిళలను స్వయం సహాయక సంఘాలు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, ఆర్థిక కార్యకలాపాల ద్వారా ఆదాయాన్ని ఆర్జించే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపాయి. ఈ నేపథ్యంలో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం మహిళల ఆర్థిక సాధికారతకు ప్రతీకగా మారిందని పేర్కొన్నాయి. కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను పెంచడం, వారికి స్వతంత్ర ఆదాయ వనరులు కల్పించడం, బ్యాంకింగ్ మరియు రుణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం, స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపార అవకాశాలను విస్తరించడం వంటి చర్యలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని వివరించాయి. అయితే మహిళల అభివృద్ధిని ఒకే రాజకీయ పార్టీ విజయంగా కాకుండా, దేశవ్యాప్తంగా మహిళలకు అందుతున్న వాస్తవ అవకాశాలు, ఆదాయ పెరుగుదల, ఉపాధి, వ్యాపార సామర్థ్యం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక ప్రమాణాల ఆధారంగా అంచనా వేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. 'లఖ్‌పతి దీదీ' లక్ష్యం ద్వారా మహిళల వార్షిక కుటుంబ ఆదాయాన్ని పెంచే దిశగా కృషి జరుగుతుండగా, ఆర్థిక స్వావలంబన మహిళల నిర్ణయాధికారాన్ని, కుటుంబంలో వారి స్థాయిని, సామాజిక గౌరవాన్ని బలోపేతం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో రాజకీయ ప్రాతినిధ్యం కూడా మహిళా సాధికారతలో మరో కీలక అంశం కావడంతో, ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి, రాజకీయ అవకాశాలు సమానంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో మహిళలను కేవలం ఓటర్లుగా చూడకుండా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దడం, వారి ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి మరియు వ్యాపార రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా నారీ శక్తిని మరింత బలోపేతం చేయవచ్చని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి.

# అనకాపల్లి జిల్లాలో ప్రతి చెరువు, జలాశయాన్ని నింపే బాధ్యత తీసుకుంటాం - చంద్రబాబు నాయుడు





అనకాపల్లి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అనకాపల్లి జిల్లాలో ప్రతి చెరువును, ప్రతి జలాశయాన్ని నింపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జిల్లాలో నీటి వనరులను పరిరక్షించి, అవసరమైన ప్రాంతాలకు సాగు, తాగునీటి వసతులు మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. అదే సమయంలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సేవ చేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

# ప్రతి పల్లెకు ఆధునిక వైద్య సదుపాయాలు



అమరావతి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు సులభంగా, వేగంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రికార్డు స్థాయిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. పల్లెల్లోనే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా పట్టణాలు, జిల్లా కేంద్రాలపై వైద్య సేవల కోసం ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపింది. నూతన పీహెచ్‌సీల ద్వారా సాధారణ అనారోగ్యాలకు చికిత్స, ప్రాథమిక పరీక్షలు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య అవగాహన వంటి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని ఆరోగ్య కేంద్రంలోనే ప్రాథమిక చికిత్స పొందే అవకాశం పెరుగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రతి పల్లెకూ నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపింది.



## మెదక్ జిల్లాకు చేరిన గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి కలశం

మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వారణాసి నుంచి తెలంగాణ రాష్ట్రానికి తీసుకువచ్చిన పవిత్ర కలశం మెదక్ జిల్లాకు చేరుకుంది. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా గురు రవిదాస్ మహారాజ్ జయంతి కలశాన్ని రాబోయే ఏడు నెలలపాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో ఊరేగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లాకు చేరుకున్న కలశాన్ని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాస్కురి బాలరాజు ఆధ్వర్యంలో, భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన పార్టీ నాయకులు స్వీకరించారు. గురు రవిదాస్ మహారాజ్ బోధించిన సమానత్వం, సామాజిక ఐక్యత, మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కలశ యాత్రను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు బబ్బురి కృష్ణ, సురేష్, రఘు, కర్రోళ్ల స్వామి, నిమ్మల స్వామి, దయాకర్, సరిత, పోచయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హామీలు నెరవేర్చకుంటే వికారాబాద్ నుంచే ఉద్యమం: గిద్దె రాజేష్





వికారాబాద్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో వికారాబాద్ నుంచే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ హెచ్చరించారు. ఆదివారం వికారాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో సంఘం వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గిద్దె రాజేష్, సుధీర్‌తో ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా, ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచుతామని, రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణ సాకర్యం కల్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం 2016లో తీసుకువచ్చిన వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి వెంటనే తన వైఖరిని మార్చుకుని వికలాంగుల సమస్యలపై నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని, పెన్షన్‌ను రూ.6,000కు పెంచడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో 100 శాతం ఉచిత ప్రయాణ సాకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని, ఆ చట్టాన్ని అమలు చేసిన తర్వాతే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే వికారాబాద్ నుంచే తమ ఉద్యమాన్ని ప్రారంభించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై గిద్దె రాజేష్ విమర్శలు చేశారు. అసెంబ్లీలో వికలాంగుల సమస్యలపై కనీసం గంటపాటు చర్చకు అవకాశం కల్పించి ఉంటే రాష్ట్రంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభించేదని, ప్రతిపక్షాలు వికలాంగుల సమస్యలపై చర్చకు వాయిదా తీర్మానాలు ఇచ్చినా అనుమతించలేదని ఆరోపించారు. వికలాంగుల సమస్యలపై ప్రభుత్వం, శాసనసభ తక్షణమే స్పందించి వారి హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించి స్పష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సంఘం జిల్లా నాయకులు ఊరడి హనుమంతు అధ్యక్షత వహించగా అనేం గణేష్, ఎం.చుక్కయ్య, జానీ, మహేష్, అర్జున్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద 300 గ్రాముల పాపీ స్ట్రా పౌడర్ స్వాధీనం

మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): అక్రమంగా తరలిస్తున్న 300 గ్రాముల పాపీ స్ట్రా పౌడర్‌ను అబ్కారీ అధికారులు తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్నారు. మెదక్ జిల్లా అబ్కారీ అధికారి నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నర్సాపూర్ సీఐ గులాం ముస్తఫా ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న పాపీ స్ట్రా పౌడర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొలేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తనిఖీల్లో ఎస్ఐలు రాఘవేంద్రరావు, ఖాజా అజీజ్ అహ్మద్‌తో పాటు నర్సాపూర్ అబ్కారీ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రవీ, రాశేకర్, కానిస్టేబుళ్లు షాహిద్, సందీప్, మెదక్ డీటీఎఫ్ సిబ్బంది ఎస్ఐ బాలయ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మాదక పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అబ్కారీ అధికారులు స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న పాపీ స్ట్రా పౌడర్‌కు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని, అక్రమ రవాణాకు సంబంధించిన ఇతర వివరాలను కూడా విచారణలో వెలికితీస్తామని అధికారులు తెలిపారు.




## ప్రతిభావంతుల ప్రోత్సాహమే సమాజాభివృద్ధికి పునాది కూరపాటి వెంకటనారాయణ

సూర్యాపేట, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా సమాజాభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పద్మశాలి భవన్‌లో పద్మశాలి సేవా సమాజ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ విద్య మాత్రమే సమాజాన్ని మార్చగల శక్తివంతమైన సాధనమని, సంక్షేమ పథకాలతో పాటు విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 12 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు ప్రభుత్వ సహాయంపై పూర్తిగా ఆధారపడకుండా కష్టపడి, స్వశక్తితో అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని సూచించారు. పద్మశాలీలు రాజకీయాల్లో మరింతగా రాణించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. తాను పద్మశాలి సామాజిక వర్గానికి చెందినవాడిననే కారణంతోనే తెలుగు అకాడమీ చైర్మన్‌గా అవకాశం లభించిందని పేర్కొంటూ, తెలుగు అకాడమీ తరఫున ఇంటర్మీడియట్‌లో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు అకాడమీ ప్రతి సంవత్సరం దాదాపు రూ.10 కోట్ల విలువైన పుస్తకాలను ముద్రిస్తోందని తెలిపారు. సూర్యాపేటతో తనకు ఎంతో అనుబంధం ఉందని, మారోజు వీరన్న వంటి ప్రముఖులను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. సూర్యాపేట కొంతకాలంగా అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైందని వ్యాఖ్యానించారు. తాను జీవించే కాలంలో తెలంగాణలోని 33 జిల్లాలను సందర్శించి ఆయా జిల్లాల్లోని పద్మశాలి సోదరులను కలుసుకోవాలనే సంకల్పం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన ఆయన, తాను తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్‌కు అనుచరుడినని తెలిపారు. చారిత్రక నిర్మాణాలను కూల్చివేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో ఐదవ స్థానంలో ఉన్న పద్మశాలీలు ఐకమత్యంతో ముందుకు సాగాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘాలను ఏర్పాటు చేయకుండా సమాజ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని సూచించారు. పద్మశాలి సమాజ అభ్యున్నతితో పాటు తెలుగు అకాడమీ అభివృద్ధికి తనవంతు కృషి కొనసాగిస్తానని, బీసీ అజెండా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పెండం చంద్రశేఖర్, విశిష్ట అతిథి ప్రొఫెసర్ రుద్ర సాయి బాబా, ఉపాధ్యక్షులు యలగందుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పెండం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి చల్లమల్ల వెంకటరమణ, కోశాధికారి పెండెం కృష్ణకుమార్, కార్యవర్గ సభ్యులు వైద్యులు పెండం వెంకటరమణ, మానుపూరి రాములు, ముషం రవి, రావిరాల మల్లయ్య, యలగందుల రామలింగయ్య, మానుపూరి ప్రసాద్, సన్మాన గ్రహీతలు కందలగడ్డ మల్లికార్జునరావు, కొంపల్లి అజయ్‌కుమార్, గాజుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## పేదల పక్షపాతిగా కుక్కడపు ప్రసాద్.. పోరాటయోధుడిగా చిరస్థాయిగా నిలిచారు

సూర్యాపేట, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కార్మిక, కర్షక ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషిస్తూ పేదల పక్షపాతిగా పేరుపొందిన గొప్ప పోరాటయోధుడు కుక్కడపు ప్రసాద్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు అధ్యక్షతన నిర్వహించిన కుక్కడపు ప్రసాద్ ఆరో వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరైన నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ధనిక రైతాంగ కుటుంబంలో జన్మించిన ప్రసాద్ తన తండ్రి రంగయ్య అడుగుజాడల్లో నడుస్తూ విప్లవ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కోదాడ పట్టణ అభివృద్ధితో పాటు వివిధ రంగాలకు చెందిన కార్మిక వర్గాన్ని సమీకరించి వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడిగా కుక్కడపు ప్రసాద్ నిలిచారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయనకు ఉన్న అచంచలమైన విశ్వాసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఎర్రజెండా నీడలో చివరి వరకు పనిచేసిన తీరు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలపై ఆయన సాగించిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మునగాల మండల సీపీఎం కార్యదర్శి శ్రీరాములు, జుట్టుకొండ బసవయ్య, వట్టెపు సైదులు, డాక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, అడ్వకేట్ రంగారావు, అలుగాని బ్రహ్మయ్య, కుక్కడపు బాబు, ప్రసాద్ సతీమణి కుక్కడపు నళిని, మరియన్న, కోటేశ్వరరావు, బిక్షమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్‌లో ప్రభాకర్ చారికి సభ్యత్వం

మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ మెదక్ జిల్లా యూనియన్‌లో ప్రభాకర్ చారికి సభ్యత్వం కల్పించారు. జాతీయ కమిటీ అధ్యక్షులు శెట్టి అశోక్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడు రత్నం చారి సమక్షంలో ప్రభాకర్ చారిని సంఘంలో సభ్యుడిగా చేర్చుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రభాకర్ చారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘం చేపట్టే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేస్తూ వారి సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సభ్యత్వం పొందిన ప్రభాకర్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో సంఘంలో సభ్యత్వం కల్పించిన జాతీయ, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘంతో కలిసి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



## మిలాద్-ఉన్-నబీ కవి సమ్మేళనంలో అలరించిన తెలుగు, ఉర్దూ, హిందీ కవితాగానం

నంద్యాల, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎం.ఎండి. రఫీ అధ్యక్షతన శ్రీనివాసనగర్‌లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎండి. రఫీ మాట్లాడుతూ ఇస్లాం శాంతి, ప్రేమ, సహనం, కరుణ, దయ, క్షమాగుణాలను ప్రబోధించే మార్గమని, ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహమ్మద్ ప్రవక్త (స) జీవితం త్యాగం, నీతి, నిజాయితీ, మానవతా విలువలకు ఆదర్శమని పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొని సమాజ శాంతి, సౌభ్రాతృత్వం కోసం కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ప్రవక్త బోధించిన శాంతి, అహింస, క్షమాగుణాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించి మంచి సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా మాట్లాడుతూ ఉన్నదాన్ని ఇతరులతో పంచుకోవడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అజీజ్, సహాయ కార్యదర్శి ఎం. రఫీక్, కార్యవర్గ సభ్యులు ఫజులూరు, కోశాధికారి వాహబ్, రోటరీ పాఠశాల కరస్పాండెంట్ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు జమాల్, జిలానీ, అయూబ్ తదితరులు పాల్గొన్నారు. కడప, కర్నూలు, మార్కాపురం, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 50 మంది కవులు మిలాద్-ఉన్-నబీ విశిష్టత, మహమ్మద్ ప్రవక్త (స) జీవితం, మానవతా విలువలు, శాంతి సందేశాలపై తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో కవితలను ఆలపించి సభికులను ఆకట్టుకున్నారు. వివిధ మతాలకు చెందిన కవులు ఒకే వేదికపై తమ కవితలను వినిపించడం జాతీయ సమైక్యత, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ముస్లిం విద్యార్థిని కవితాగానం చేసి సాహిత్యాభిమానులను విశేషంగా ఆకర్షించింది. నంద్యాల మురసం ఆధ్వర్యంలో పాల్గొన్న కవులందరినీ శాలువాలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు.

## రాంసాన్‌పల్లిలో ఇన్నర్ వీల్ సేవా కార్యక్రమం





మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): రాంసాన్‌పల్లి గ్రామంలో ఇంటర్నేషనల్ ఇన్నర్ వీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయం, ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు కుర్చీలను, గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు వివిధ రకాల మొక్కలను ఇన్నర్ వీల్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడం, నీటి సంరక్షణ చేపట్టడం, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన ఇన్నర్ వీల్ సంస్థను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మి ఆగమయ్య, మాజీ ఉపసర్పంచ్ మన్నె మొగులయ్య, పట్నం మొగులయ్య, వార్డు సభ్యులు ఎరుకల నాగయ్య, భూమయ్య, రాజు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మేజర్ సర్జరీలు కూడా స్థానికంగానే: మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రులను మేజర్ సర్జరీలు నిర్వహించగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. టీచింగ్ హాస్పిటళ్ల స్థాయిలో జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు జిల్లా, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని తెలిపారు. డీఎస్‌హెచ్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది, పరికరాలపై హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో శనివారం మంత్రి సమీక్ష నిర్వహించారు. చిన్నచిన్న సమస్యలకు కూడా పేషెంట్లను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సేవలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రిఫర్ చేయాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆసుపత్రికి సమాచారం అందించి సమన్వయంతో చికిత్స అందించాలని సూచించారు. అవసరమున్న ఆసుపత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, ఇతర వైద్య, నిర్ధారణ పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్‌లు వారానికి కనీసం ఒకరోజు తమ పరిధిలోని ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది హాజరు, మందులు, పరికరాలు, పరీక్షలు, పరిశుభ్రత, తాగునీరు తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. విధులకు గైర్హాజరు కావడం, ముందుగానే వెళ్లిపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి వాటిని సహించబోమని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి హెచ్చరించారు. ఆసుపత్రుల్లో సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో పరిష్కరించాలని, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, యాంత్రిక, విద్యుత్, ప్లంబింగ్, తాగునీరు, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సీఎం తండాలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.. 25 కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): టేక్మాల్ మండలం చెరువుముందరి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సీఎం తండాలో గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. వాటర్ సప్లై మోటార్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో రైతుల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకుంటూ ఉండటం, తరచూ విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో తండాలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీంతో సమస్యను సర్పంచ్ రాతలా దేప్లీ, గ్రామ పెద్దలు రామావత్ అనిల్, మాజీ ఉపసర్పంచ్ రాతలా లక్ష్మ, రాతలా గోపాల్ తదితరులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన మంత్రి వెంటనే స్పందించి తండా ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో 25 కేవీఏ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 23న కాంట్రాక్టర్ ద్వారా తండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ పనులను వేగంగా చేపట్టారు. దీంతో తండాలో నీటి సరఫరా సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మాజీ అధ్యక్షుడు మాన్ కిషన్‌కు తండా ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు గీత, కిషన్, రుక్కి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏడుపాయలకు పోటెత్తిన భక్తులు.. కిటకిటలాడిన వనదుర్గామాత ఆలయం



మెదక్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన ఏడుపాయల శ్రీ వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే మెదక్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఏడుపాయలకు తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లలో బారులు తీరారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న పలువురు దంపతులు సంతాన గుండంలో స్నానాలు ఆచరించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసి, రద్దీని నియంత్రిస్తూ భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. ఆలయ పూజారులు పార్థివ శర్మ, శంకర్ శర్మ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు భక్తులకు సేవలందించడంలో నిమగ్నమయ్యారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ రద్దీని పర్యవేక్షించారు.




## అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన.. బీవీఆర్ఐటీలో ఘనంగా చంద్రప్రస్థాన్-2026

నర్సాపూర్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చంద్రప్రస్థాన్-2026 కార్యక్రమాన్ని రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, గ్రహాల అన్వేషణపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక క్విజ్‌లు, విజువల్ ఛాలెంజ్‌లు, స్వయంచాలక గ్రహ ల్యాండర్ నమూనాల తయారీ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం రెండో రోజు హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ వెంకట్ శేషు 'సముద్రాలు, వాతావరణం, జీవం మధ్య పరస్పర సంబంధాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సముద్రాలు, వాతావరణ మార్పులు, జీవ వ్యవస్థల మధ్య ఉన్న సంబంధాలను శాస్త్రీయ దృక్పథంతో వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో అంతరిక్ష రంగంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు భవిష్యత్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణల వైపు అడుగులు వేసేలా చంద్రప్రస్థాన్-2026 కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ బాపిరాజు, వివిధ విభాగాల అధిపతులు, ఏవోలు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కడిదేవునికి జలాభిషేకం.. వర్షాలు కురుస్తాయన్న గ్రామ ప్రజల విశ్వాసం





అల్లాదుర్గం, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ అల్లాదుర్గం ప్రతినిధి ప్రవీణ్): అల్లాదుర్గం మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నీటితో నిండాలని, పంటలు పండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు కడిదేవునికి జలాభిషేకం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, విశ్వాసాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం నుంచే గ్రామస్తులు కడిదేవుని వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, రైతులు నీటి బిందెలతో ఆలయానికి చేరుకుని కడిదేవునికి జలాభిషేకం చేసి అనంతరం కొబ్బరికాయలు కొట్టి, పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి గ్రామంలో పాడిపంటలు కళకళలాడాలని, రైతులకు మంచి దిగుబడులు రావాలని గ్రామస్తులు ప్రార్థించారు. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ జలాభిషేక కార్యక్రమానికి ప్రాధాన్యత ఏర్పడింది. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి సాగునీటి సమస్యలు తొలగిపోవాలని రైతులు ఆకాంక్షించారు. పంటలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడి దిగుబడులు పెరగాలని కోరుకున్నారు. వర్షాలు కురవాలని కడిదేవునికి జలాభిషేకం చేయడం తమ గ్రామీణ సంప్రదాయంలో భాగమని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరప్ప, సంగప్ప, రాజు, సంగమేశ్వర్, ఆంజనేయులు, హన్మప్పతో పాటు గ్రామ యువకులు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై రామకృష్ణ వివాహ వేడుకల్లో నేషనల్ హ్యూమన్ రైట్స్ బృందం



సంగారెడ్డి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మల్కాపూర్ ఎక్స్‌రోడ్డులో గోకుల్ గార్డెన్స్‌లో ఆదివారం నాగల్‌గిద్ద మండల ఎస్సై కాశీపురం రామకృష్ణ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండారి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జి. ప్రభాకర్, విష్ణు, రిపోర్టర్ లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న నేషనల్ హ్యూమన్ రైట్స్ బృందానికి ఎస్సై రామకృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఇంద్రకరణ్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని అన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు నిలుస్తాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఆర్థిక, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, కంది మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొగులయ్య, మోతిలాల్ నాయక్, సర్పంచ్ శంకరీ రాజు, ఉపసర్పంచ్ కొన్నాల లావణ్య, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ





సంగారెడ్డి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా నారాయణఖేడ్ పట్టణంలో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, నారాయణఖేడ్ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు వారి ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజారోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో ఆదరణ క్రమంగా పెరుగుతోందని, ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ హరిణి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీపీఎస్ రద్దు కోసం చలో హైదరాబాద్‌కు వట్టిపల్లి మండల ఉపాధ్యాయులు

వట్టిపల్లి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ సీపీఎస్ మహాధర్నా కార్యక్రమానికి వట్టిపల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయుల బృందం ఆదివారం తరలివెళ్లింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ అనంతర భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో భవిష్యత్ ఆర్థిక భద్రతపై ఆందోళన నెలకొందని, తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ మహాధర్నాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగిస్తామని వట్టిపల్లి మండల ఉపాధ్యాయులు స్పష్టం చేశారు.




# NPRD INDIA నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బుక్క ఇస్మాయిల్ నియామకం

నారాయణఖేడ్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (NPRD INDIA) సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా మన్నూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బుక్క ఇస్మాయిల్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని NPRD INDIA రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ నాయకులు బుక్క ఇస్మాయిల్‌కు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్, ఎస్‌కేఐటీయూ (SKITU) రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ షఫీ, ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షులు గజ్జె పైడి కుమార్, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ శబరి చావ్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుక్క ఇస్మాయిల్‌ను నాయకులు అభినందిస్తూ నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం బుక్క ఇస్మాయిల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, దివ్యాంగులకు రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులను సాధించేందుకు నిరంతరం పోరాడుతానని అన్నారు. సంస్థ ఆశయాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నియోజకవర్గంలో సంస్థను మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని బుక్క ఇస్మాయిల్ స్పష్టం చేశారు.

# ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించిన వార్డు సభ్యురాలు పల్లె సురేఖ-యాదగిరి



వట్‌పల్లి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాసరి యాదయ్య కుమారుడి కుటుంబాన్ని 12వ వార్డు సభ్యురాలు పల్లె సురేఖ-యాదగిరి పరామర్శించి తన వంతు సహాయాన్ని అందించారు. ఆగస్టు 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసరి యాదయ్య కుమారుడు మృతి చెందడంతో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి ఆహార అవసరాల నిమిత్తం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ కష్టకాలంలో తాము అండగా ఉంటామని, తమ కార్యకర్తలకు లేదా గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తనవంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆపన్నహస్తం అందించిన పల్లె సురేఖ-యాదగిరిని స్థానికులు అభినందించారు.



# ఎస్ఐఆర్ రెండో దశ విజయవంతానికి సమష్టి కృషి చేయాలి: బీజేపీ

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ అసెంబ్లీ కార్యాలయంలో ఎస్ఐఆర్ రెండో దశ కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణిత, ఎస్ఐఆర్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్ఏ-2లకు రెండో దశ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, చేపట్టాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొదటి దశలో బీఎల్ఏ-2లు సమష్టిగా, సమర్థవంతంగా పనిచేయడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్ఫూర్తితో రెండో దశలోనూ మరింత అంకితభావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఏ-2లకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏ-2లు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ రెండో దశను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మాజీ ఓబీసీ మోర్చా నాయకుడు రమేష్ గౌడ్, రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అశోక్, సాదుల బిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు గుండం శంకర్, సుభాష్ గౌడ్, మండల అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్, పెద్దపులి రవి, హరీష్, నాగేందర్ రెడ్డి, బీఎల్ఏ-2లు, మండల నాయకులు, సర్పంచులు నాగభూషణం, మల్లేశం, కుమార్, ఉపసర్పంచ్ నరేష్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం: ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తోందని, ఎవరైనా అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు పొందలేకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ సుధీర్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలోని రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్‌లో పుష్పగిరి రెటినా ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి నర్సాపూర్ పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 600 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో ఆపరేషన్ అవసరమైన వారికి నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాల ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కంటి పరీక్షల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో శిబిరం సందడిగా మారింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు మజ్దూర్ యూనియన్ బలోపేతం

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెదక్ జిల్లా నర్సాపూర్ డిపోకు చెందిన ఉద్యోగులు సమిష్టిగా తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు మద్దతు ప్రకటించి, ఒకే యూనియన్‌గా ఏర్పడి అశ్వత్థామ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకుడు అశ్వత్థామ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో కార్మికులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు యూనియన్ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, భద్రత, భవిష్యత్ ప్రయోజనాల కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమం డిపో కార్యదర్శి కె. వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ముఖ్య సలహాదారు మాందాపురం శ్రీనివాస్, మెదక్ రీజియన్ ఇన్‌చార్జి మేడి రాధాకృష్ణన్ రావు, రాష్ట్ర నాయకులు మాటూరి శాఖయ్య, అశ్వక్ అహ్మద్, సుబ్బారావు, నర్సాపూర్ డిపో అధ్యక్షుడు నాగరాజు గౌడ్, రామాంజనేయులు, ప్రేమ్ కుమార్, శ్రీధర్ గౌడ్, శివకుమార్, ఎం. గోపాల్, బిక్షపతి, జమీల్ మియా, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.



# వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం: వ్యవసాయ అధికారులు

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని లింగాపూర్ రైతు వేదికలో వరి పంట నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు పంటల వైవిధ్యీకరణపై రెండో రోజు సహచర అభ్యాస శిక్షణ కార్యక్రమం (ఆర్‌పీఎల్–రికగ్నిషన్ పీర్ లెర్నింగ్) వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకే హెడ్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ రైతులకు పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యత, వరికి ప్రత్యామ్నాయంగా అనువైన పంటలు, పంట మార్పిడి విధానం, నీటి వినియోగాన్ని తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, రైతుల ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎం. దీపిక మాట్లాడుతూ రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వరితో పాటు ప్రాంతానికి అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పంటలపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించుకుని రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణలో భాగంగా రైతుల్లో అవగాహన స్థాయిలో వచ్చిన మార్పును తెలుసుకునేందుకు పోస్ట్ ఎవాల్యుయేషన్ నిర్వహించి, శిక్షణకు ముందు, అనంతరం రైతుల అవగాహన స్థాయిని అంచనా వేసి ఫలితాలను నమోదు చేశారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన రైతులకు శిక్షణ పూర్తి చేసిన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ శిక్షణ ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగు, పంట మార్పిడి, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు, నేల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై మెరుగైన అవగాహన పొందామని తెలిపారు. రైతులు శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తమ పొలాల్లో ఆచరణలో పెట్టి, స్థానిక వాతావరణం, నేల పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు దుర్గాప్రసాద్, రాజశేఖర్, ఏటీఎం హరీష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్అదాలత్‌ను విజయవంతం చేయాలి: న్యాయమూర్తి ఎం. హేమలత




నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్‌ను విజయవంతం చేసి, రాజీకి అవకాశం ఉన్న కేసులను సత్వర పరిష్కారం చేసుకునేలా కక్షిదారులకు సహకరించాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి ఎం. హేమలత పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్ ఏర్పాట్లు, కేసుల పరిష్కారంపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. హేమలత మాట్లాడుతూ రాజీ చేయదగిన కేసుల్లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్అదాలత్ ఒక మంచి అవకాశమని తెలిపారు. లోక్అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించుకోవడంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నర్సాపూర్ కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు రాజీకి అవకాశం ఉన్న కేసుల వివరాలను పరిశీలించి, సంబంధిత కక్షిదారులకు జాతీయ లోక్అదాలత్ ప్రయోజనాలను వివరించి కేసుల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. కక్షిదారులు సెప్టెంబర్ 12న నిర్వహించే జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసులను సత్వర పరిష్కారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగాకృష్ణ, నర్సాపూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి, చిలప్‌చెడ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నర్సింలు, నర్సాపూర్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రావు, కౌడిపల్లి డబ్ల్యూఏఎస్ఐ అండాలు, పోలీసు కోర్టు కానిస్టేబుళ్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీలో ఘనంగా చంద్రప్రస్థాన్-2026 వేడుకలు




మెదక్ జిల్లా నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో మూడో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని 'చంద్రప్రస్థాన్-2026' పేరుతో రెండు రోజులపాటు సాంకేతిక, విజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో అంతరిక్ష సాంకేతికత, ఎంబెడెడ్ సిస్టమ్స్, గ్రహాల అన్వేషణ, భూ వ్యవస్థల శాస్త్రం వంటి ఆధునిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, ఎస్ఈడీఎస్ లాంచ్‌ప్యాడ్ 404 స్టూడెంట్ స్పేస్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష సాంకేతిక రంగాల్లో వినూత్న పరిష్కారాలను రూపొందించే దిశగా వారిని ప్రోత్సహించారు. చంద్రప్రస్థాన్-2026లో భాగంగా సాంకేతిక క్విజ్‌లు, విజువల్ ఛాలెంజ్‌లు, ESP32 ఆధారంగా స్వయంప్రేరిత గ్రహ ల్యాండర్ పేలోడ్ ప్రోటోటైపింగ్ ఛాలెంజ్ తదితర కార్యక్రమాలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ప్రాక్టికల్ సమస్యల పరిష్కారంలో వినియోగించే అవకాశం విద్యార్థులకు లభించడంతో పాటు గ్రహాల అన్వేషణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై అవగాహన పెంపొందింది. కార్యక్రమం రెండో రోజు హైదరాబాద్‌కు చెందిన INCOIS శాస్త్రవేత్త-ఎఫ్ డా. వెంకట్ శేషు రెడ్డెం "సముద్రాలు, వాతావరణం మరియు జీవం మధ్య ఉన్న పరస్పర సంబంధాలు" అనే అంశంపై నిపుణుల ఉపన్యాసం అందించారు. సముద్ర పరిశీలన, వాతావరణ అధ్యయనాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, భూ వ్యవస్థల పర్యవేక్షణకు అవసరమైన ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను ఆయన వివరించడంతో పాటు భూమిపై ఉన్న సహజ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, వాటిని పరిరక్షించడం, శాస్త్రీయ పరిశోధనను ముందుకు తీసుకెళ్లడంలో సాంకేతిక ఆవిష్కరణల పాత్రపై విద్యార్థులకు విలువైన అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తద్వారా భూ, పర్యావరణ శాస్త్రాల్లో జరుగుతున్న సమకాలీన పరిశోధనలు, అభివృద్ధులపై మరింత అవగాహన పొందారు. కార్యక్రమం ముగింపులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. చంద్రప్రస్థాన్-2026 కార్యక్రమం విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, అంతరశాఖ పరిశోధనలపై అవగాహన పెంపొందించుకునేందుకు సమర్థవంతమైన వేదికగా నిలిచింది. విద్యార్థులకు శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో పరస్పర చర్య చేసే అవకాశాలను కల్పిస్తూ అనుభవపూర్వక అభ్యసన కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ ఆవిష్కర్తలు, అంతరిక్ష రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు బీవీఆర్ఐటీ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి.ఆర్. సంజీవ రెడ్డితో పాటు అన్ని విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బి. బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కూడా పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. విద్యార్థుల్లో అంతరిక్ష విద్య, శాస్త్రీయ ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలు, అనుభవపూర్వక అభ్యసనం, అంతరశాఖ సహకారాన్ని పెంపొందించేందుకు బీవీఆర్ఐటీ చేస్తున్న కృషికి చంద్రప్రస్థాన్-2026 మరో విజయవంతమైన ఉదాహరణగా నిలిచింది.



# గురజాల పాపారావు దశదినకర్మకు మండల నాయకుల హాజరు

చింతకాని మండలం, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 24: చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన గురజాల పాపారావు ఇటీవల అకాల మరణం చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమాన్ని శనివారం లచ్చగూడెం గ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకాని మండలానికి చెందిన పలువురు నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు కార్యక్రమానికి హాజరై గురజాల పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాపారావు మృతి ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంకెన రమేష్, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బొడ్డు రామారావు, మాజీ ఎంపీపీ గురజాల హనుమంతరావు, తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, కోమట్లగూడెం గ్రామ సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు, సొసైటీ డైరెక్టర్ ప్రసాద్, బండి రామారావు, చాపలమడుగు నరేష్, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా బండారి లక్ష్మి

కోహెడ, సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం, ఆగస్టు 24: సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం కూరెళ్ల గ్రామ సర్పంచ్ బండారి లక్ష్మి బాలరాజు ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా పురస్కారం అందుకున్నారు. గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషి, ప్రజలకు మౌలిక వసతుల కల్పన, గ్రామ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించిన అధికారులు ఆమెను ఉత్తమ గ్రామ సర్పంచ్ పురస్కారానికి ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా, మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బండారి లక్ష్మి పురస్కారాన్ని అందుకున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కడం పట్ల కూరెళ్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా పురస్కారం అందుకున్న బండారి లక్ష్మి బాలరాజు దంపతులను గ్రామ ప్రజలు, స్థానికులు అభినందించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.



# జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: మెదక్ జిల్లాలో ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిరోజూ మండలాల వారీగా 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో 2025 ఆగస్టు వరకు 20,758 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయగా, ప్రస్తుత ఖరీఫ్ 2026లో ఆగస్టు వరకు ఇప్పటికే 19,045 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. జిల్లాలో ఎరువుల సరఫరా, విక్రయాలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆగస్టు 7, 2026 నుంచి ఎఫ్ఎస్ఎస్ (FSS-ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్‌ను ప్రారంభించామని, ఈ యాప్ ద్వారా రైతులు ఎరువులను బుక్ చేసుకునే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. కొత్తగా ప్రారంభించిన యాప్‌లో తొలుత కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని గుర్తించి పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మొదట్లో రైతులు జిల్లాలో ఎక్కడైనా ఎరువులు కొనుగోలు చేసుకునే విధంగా అవకాశం కల్పించామని, అయితే ఇతర మండలాలకు వెళ్లాల్సి రావడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గత రెండు రోజులుగా డివిజన్ వారీగా ఎరువులు అందించే విధంగా యాప్‌ను అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రైతులు తమ సొంత మండలంతో పాటు అవసరమైన సందర్భంలో ఇతర మండలాల్లో కూడా ఎరువులు కొనుగోలు చేసుకునే విధంగా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న ఎరువుల పరిమాణం కంటే ఎక్కువగా రైతులు ఒకేసారి బుకింగ్ చేయడం వల్ల యాప్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నట్లు గుర్తించామని, ఈ అంశంపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక పంపడంతో పాటు సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ అవసరాలకు మించి ఎరువులను కొనుగోలు చేయడం వల్ల అవసరమైన ఇతర రైతులకు ఎరువులు అందక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రతి రైతు తన పంటకు అవసరమైన మేరకే ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలను రైతులు పాటిస్తూ అందుబాటులో ఉన్న ఎరువులను సమన్వయంతో వినియోగించుకోవాలని, ఎరువుల సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

# టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా జిల్లా, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధి: మంత్రి దామోదర్ రాజనర్సింహ





సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి ఇన్‌చార్జి కే. సంగమేశ్వర్, ఆగస్టు 24: రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, డిస్ట్రిక్ట్ హాస్పిటళ్లను మేజర్ సర్జరీలు నిర్వహించగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా స్థానికంగానే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే సామర్థ్యం జిల్లా, ఏరియా ఆసుపత్రులకు ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, వైద్య పరికరాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆసుపత్రులకు అనవసరంగా రిఫర్ చేసే విధానాన్ని వెంటనే మార్చాలని హెచ్చరించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించకుండా రోగులను గాంధీ, ఉస్మానియా వంటి పైస్థాయి ఆసుపత్రులకు పంపడం వల్ల రోగులపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు టెర్షియరీ ఆసుపత్రులపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. సరైన వైద్య కారణం లేకుండా రోగులను రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన మంత్రి, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే మరో ఆసుపత్రికి రిఫర్ చేయాలని, అలా పంపాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆసుపత్రి వైద్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీసీహెచ్ఎస్‌లు కార్యాలయాలకే పరిమితం కాకుండా తమ పరిధిలోని ప్రతి ఆసుపత్రిని వారానికి కనీసం ఒకసారి ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సకాలంలో వైద్యం అందుతోందా, బెడ్లు, మందులు, పరికరాలు, పరీక్షలు, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయా, ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి నెలా పనితీరు నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. విధులకు గైర్హాజరు కావడం, నిర్ణీత సమయం కంటే ముందే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని, అలాంటి ఘటనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరం ఉన్న ఆసుపత్రుల్లో కొత్త సిటీ స్కాన్లు, ఇతర వైద్య, డయాగ్నస్టిక్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పరికరాల అవసరాన్ని రోగుల సంఖ్య, వైద్య సేవల అవసరం, వినియోగ సామర్థ్యం తదితర అంశాలతో స్పష్టమైన జస్టిఫికేషన్‌తో సమర్పించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు జిల్లా, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులు, పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని పేద, సామాన్య ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

# ఒక్కడే.. 60కిపైగా చోరీ కేసుల్లో నిందితుడు! తూప్రాన్‌లో మూడు చోరీ కేసుల్లో అరెస్ట్.. తాళం వేసిన ఇళ్లు, షాపులే లక్ష్యంగా చోరీలు



తూప్రాన్, సందేశం టైమ్స్, ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం, ఆగస్టు 24: తూప్రాన్ పట్టణంలో నమోదైన మూడు చోరీ కేసులకు సంబంధించి కందుల సత్యనారాయణ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో 60కిపైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. విశాఖపట్నానికి చెందిన సత్యనారాయణ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పగటి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను గుర్తించి, రాత్రి వేళల్లో వాటిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఒకే ప్రాంతంలో స్థిరంగా ఉండకుండా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. తూప్రాన్‌లో నమోదైన మూడు చోరీ కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.



## దివ్యాంగులకు యూడీఐడీ ప్రత్యేక శిబిరం ఈనెల 25న

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: దివ్యాంగుల కోసం మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించనున్న యూనిక్ డిసెబిలిటీ ఐడీ (యూడీఐడీ) ప్రత్యేక శిబిరం తేదీలో మార్పు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈనెల 26వ తేదీన యూడీఐడీ శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటన జారీ చేసినప్పటికీ, ఆ రోజున మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున శిబిరాన్ని ఈనెల 25వ తేదీ మంగళవారం మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. నూతన చేయూత పెన్షన్ల దరఖాస్తుల గడువు ఈనెల 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు యూడీఐడీ ధ్రువీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఆగస్టు 24వ తేదీ సాయంత్రం వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి స్లాట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేసి, ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక శిబిరంలో యూడీఐడీకి సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం, సంబంధిత మండల ఏపీఎంల ద్వారా శిబిరానికి సంబంధించిన సమాచారం అందజేస్తామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యూడీఐడీ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు మరియు ఇతర ప్రయోజనాలను పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## చిల్లర్‌లో న్యాయ అవగాహన సదస్సు

మెదక్/అల్లాదుర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: అల్లాదుర్గం మండలం చిల్లర్ గ్రామంలో సర్పంచ్ ముక్కెర శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల న్యాయ సేవా సంస్థ సహకారంతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లాదుర్గం జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఏ. సుచరిత ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు వివిధ చట్టాలు, న్యాయ సేవలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలు, అవసరమైన సందర్భాల్లో న్యాయ సహాయం పొందే విధానం, తమ హక్కులను పరిరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే తీర్పులను ప్రత్యేక భాషల్లోకి అనువదించడం, ప్రపంచ ఆదివాసీ ప్రజల దినోత్సవం, ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం, వ్యవసాయ చట్టాలు, రైతు సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వివరించారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని అవసరమైన సమయంలో న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నమండవ-చొప్పకట్లపాలెం రహదారి పనులకు శ్రీకారం

చింతకాని, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 24: చింతకాని మండలం చిన్నమండవ నుంచి బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెం వరకు సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. రహదారి నిర్మాణంలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులను మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, ఉప సర్పంచ్ తంగిరాల మాధవి, ఖమ్మం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఎన్. మడిపల్లి భాస్కర్ తదితరులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయని నాయకులు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే చింతకాని, బోనకల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజల రోజువారీ ప్రయాణాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రహదారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఈ పనుల ప్రారంభంతో ఉపశమనం కలగనుందని, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరపాటి కిషోర్, బంజర నాగార్జున, నెల్లూరు కోటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య, మరీదు రామకృష్ణ, పరసగాని సతీష్, దొక్కుపర్తి గోపాలరావు, శ్యామకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: సంగారెడ్డి జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. సంగారెడ్డి జిల్లాలో పోలీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియను పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయంతో ఏకగ్రీవంగా పూర్తి చేశారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షులుగా ఇన్‌స్పెక్టర్ బి. రమేష్, ఎస్ఐ బి. నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజారామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. సంతోష్ కుమార్, ట్రెజరర్‌గా హెడ్ కానిస్టేబుల్ కూన రమేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందిస్తూ పదవి ఎంత గొప్పదో, దానికి సంబంధించిన బాధ్యత కూడా అంతే గొప్పగా ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నూతన కార్యవర్గం చురుగ్గా పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమన్వయంతో పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేయాలని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అనారోగ్యంతో యువతి మృతి.. మూసాపేటలో విషాదం

నర్సాపూర్, సందేశం టైమ్స్, ఆగస్టు 24: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మూసాపేట గ్రామంలో అనారోగ్యంతో యువతి మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన గడ్డం నరహరి–మైనమ్మ దంపతుల పెద్ద కుమార్తె విజయ గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. యువతి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎంతో భవిష్యత్తు ఉన్న కుమార్తె అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలచివేశాయి. విజయ మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, కుటుంబ సభ్యులను పలువురు గ్రామస్థులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## రేగోడ్ ఏఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన సందేశం టైమ్స్ ప్రతినిధులు

రేగోడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 24: రేగోడ్ మండల ఏఎస్సై పెంటయ్యను సందేశం టైమ్స్ రేగోడ్ మండల రిపోర్టర్ మంతురి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిస్థితి, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసుల పాత్ర తదితర అంశాలపై ఏఎస్సైతో చర్చించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సమన్వయంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యతపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం అందోల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సీహెచ్ బస్వరాజు, స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, సబ్ ఎడిటర్ టీ. సంగమేశ్వర్, సాయి వెంకట్ తదితరులు ఏఎస్సైని కలిసి మర్యాదపూర్వకంగా మాట్లాడారు.



## నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 24: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా రహదారులపై తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా వాహనాల యజమానులతో అప్పటికప్పుడే వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించి, ఇకపై ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా సూచనలు చేశారు. అనంతరం పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాలని సూచించారు. వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగిన సమయంలో వాహనాన్ని గుర్తించడం చాలా కష్టమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు నంబర్ ప్లేట్లు అమర్చుకుని రహదారులపై ప్రయాణించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నియంత్రణ, నేరాల నివారణలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు.



## శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా పెరిగిన వరద

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 24: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం జలాశయానికి 45,192 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 48,444 క్యూసెక్కుల నీటిని ఔట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 166.70 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 875.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా పెరగడంతో అధికారులు నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలం కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు సమాచారం. జలాశయానికి వస్తున్న వరద, నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో పరిస్థితులను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు.

## MNR యాజమాన్యం తీరుపై విద్యార్థుల ఆగ్రహం.. ఎమ్మెల్యేను ఆశ్రయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు



సంగారెడ్డి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): MNR విద్యాసంస్థ యాజమాన్యం తమకు అన్యాయం చేస్తోందంటూ పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఆశ్రయించారు. అడ్మిషన్ సమయంలో యాజమాన్యం సూచించిన విధంగానే ఫీజు చెల్లించి తమ పిల్లలను విద్యాసంస్థలో చేర్పించామని తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే నెల రోజుల పాటు తరగతులు నిర్వహించిన అనంతరం విద్యార్థులు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని యాజమాన్యం పేర్కొంటోందని వారు ఆరోపించారు. ఈ విషయంపై యాజమాన్యాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బందితో బయటకు పంపించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా విద్యార్థులు తిరిగి విద్యాసంస్థలో కొనసాగాలంటే మరో రూ.2 లక్షల ఫీజు చెల్లించాల్సిందేనని, లేకపోతే విద్యాసంస్థలోకి అనుమతించబోమని యాజమాన్యం చెబుతోందని వారు ఆరోపించారు. అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వివరాలు తెలుసుకుని యాజమాన్యం సూచించిన మేరకు ఫీజు చెల్లించిన తర్వాత మళ్లీ అదనంగా రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడం సరికాదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. వారి సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే వెంటనే MNR యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు అన్యాయం జరగకూడదని, వారి విద్యకు ఆటంకం కలగకుండా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సోమవారం MNR యాజమాన్యం తనను కలవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యను పూర్తిగా పరిశీలించి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భరోసా కల్పించారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. రాగిజావ, గుడ్లకు సంబంధించిన నిధులను పెంచడంతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డి. విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు.




## నూతన ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డికి సందేశం టైమ్స్ ప్రతినిధుల శుభాకాంక్షలు

వట్పల్లి, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వట్పల్లి మండలానికి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీకాంత్ రెడ్డిని సందేశం టైమ్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని శాంతిభద్రతలు, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నూతన ఎస్ఐతో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందించాలని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సందేశం టైమ్స్ సబ్‌ఎడిటర్ టి. సంగమేశ్వర్, స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, అందోల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ సి.హెచ్. బస్వరాజ్, రేగోడ్ మండల రిపోర్టర్ మంతురి రాజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సందేశం టైమ్స్‌లో నూతన పదవి బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రికలో పలువురు ప్రతినిధులకు యాజమాన్యం నూతన బాధ్యతలు అప్పగించింది. గతంలో స్టేట్ కోఆర్డినేటర్‌గా సేవలందించిన టీ. సంగమేశ్వర్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సబ్‌ఎడిటర్‌గా, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసిన బి. సంగమేశ్వర్‌ను స్టేట్ కోఆర్డినేటర్‌గా, గతంలో సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన కే. సంగమేశ్వర్‌ను స్టేట్ బ్యూరోగా నియమించింది. అదేవిధంగా వట్పల్లి మండల రిపోర్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్. బస్వరాజ్‌ను ఆందోల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా, ఆందోల్ మండల రిపోర్టర్‌గా సేవలందించిన వి. వెంకటేశంను ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన బాధ్యతలు స్వీకరించిన వారు తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వార్తా సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు విశ్వసనీయమైన వార్తలను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.